సాక్షి
కాకినాడ
గురువారం । 14 । మార్చి । 2024



డెల్టాకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.



అప్రమత్తతే ఆరోగ్యమంత్రం

మానవ శరీరంలో మూత్ర పిండాల (కిడ్నీలు) పనితీరు చాలా కీలకం. వీటిని కాపాడుకోవడంలో అప్రమత్తతతో ఉంటే ఆరోగ్యానికి ధోకా ఉండదు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సెహరీ శుక్ర (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.50
కాకినాడ	6.21	4.50
అమలాపురం	6.21	4.50

అగ్రవర్ణ పేదలకు వరం

- నేడు ఈబీసీ నేస్తం నిధుల విడుదల
- జిల్లాలో మూడో విడతగా 9,516 మందికి రూ.14.27 కోట్ల లబ్ధి

కాకినాడ సిటీ: కులం, మతం, వర్గం, పార్టీ, తరతమ భేదాలు లేవు. సంక్షేమ ఫలాలు అందుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగనక్కరలేదు. నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పని లేదు. మధ్యవర్తుల ప్రమేయం మచ్చుకైనా కనిపించదు. అర్హత ఒక్కటే ప్రామాణికం. దరఖాస్తు గడువు ముగిసినా పథకం అమలులోకి వచ్చినా, అర్హులకు మళ్లీ అవకాశం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ. ఆదుకునే నేస్తం వైఎస్ జగన్. మిత్ర, తోడు, చేయూత, నేస్తం ఏ పేరుతో పిలిచినా భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోంది. జన్మభూమి కమిటీల ముసుగులో గత టీడీపీ ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అడ్డంకులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. అర్హతే ప్రామాణికంగా, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేసింది. గతంలో టీడీపీ ఓ పథకం తీసుకొస్తే, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు కొర్రీలు వేసి అర్హులను కార్యాలయాలు, నేతల చుట్టూ తిప్పుకోవడంతో సరిపోయింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులయితే చాలు. సంక్షేమ పథకం వర్తిస్తోంది. ఇంటి వద్దకే వచ్చే వలంటీరులకు చెబితే చాలు. పథకం నడిచొస్తోంది. వివిధ కారణాలతో అర్హులకు పథకం అందకపోతే, తిరిగి అవకాశం కల్పించడంతో పాటు రెండో విడతలో లబ్ధిదారుల ఖాతాకు డబ్బు జమ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ గురువారం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా జిల్లాలో మూడో విడతగా 2023–24 సంవత్సరానికి 9,516 మంది లబ్ధిదారులకు రూ.14.27 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.



మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా (ఫైల్)

రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా ఏటా రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల నుంచి ప్రారంభిస్తారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యే విధంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళా సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలు కేంద్రీకృతంగా వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిదుకుంటున్నారు. 2021–22లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా తొలి విడతలో 8,883 మంది లబ్ధిదారులకు రూ.13.32 కోట్లు అందించారు. రెండో విడతలో 9,995 మంది లబ్ధిదారులకు రూ.14.99 కోట్ల లబ్ధి చేకూర్చారు. ఇప్పుడు 2023–24 సంవత్సరానికి 9,516 మంది లబ్ధిదారులకు రూ.14.27 కోట్లను అందజేయనున్నారు. ఓసీ వర్గాల్లోని 45–60 ఏళ్ల మధ్య ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఏటా రూ. 15 వేల చొప్పున మూడేళ్లలో రూ.45 వేలు ఆర్థిక సహాయం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అందజేసినట్టయింది. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించడంతో అర్హులైన మహిళలు సొంత వ్యాపారాలు చేసుకొని వారి కాళ్లపై వారు నిలబడేందుకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగించుకుంటున్నారు.

సీఎం జగన్ మా కష్టాలను గుర్తించారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓసీ వర్గాల్లోని పేద మహిళల కష్టాలను గుర్తించారు. ఎప్పుడూ ఏ పథకం అందని మాకు ఇప్పుడు వివిధ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఈ పథకాల ద్వారా వస్తున్న మొత్తంతో మా కాళ్లపై మేము నిలబడగలుగుతున్నాం. అగ్రవర్ణ పేద మహిళలక గుర్తింపు తీసుకొచ్చి మాకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణ పడి ఉంటాం.

– వై.మహాలక్ష్మి, కాకినాడ

నేనున్నాననే మనోధైర్యం నింపారు



నేను గృహిణిని. భర్తతో కలిసి ఇంటి వద్ద నుంచే రోజువారీ జీవితంలో ఉపయోగపడే సరుకులను ప్యాకింగ్ చేసి అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నా. భర్తకు వికలాంగ పెన్షన్ అందుతోంది. ఈబీసీ నేస్తం ద్వారా వచ్చే సొమ్ము చిరు వ్యాపారం పెట్టుబడికి ఉపయోగపడుతోంది. ఇలాంటి పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా మహిళలను అన్ని విధాలా ఆదుకుంటూ నేనున్నాననే మనోధైర్యం నింపారు.

– ఎస్.నాగలక్ష్మి, చీడిగ, కాకినాడ రూరల్ మండలం

న్యూస్‌రీల్

సమన్వయంతో సమస్యల పరిష్కారం

జేసీ రామ్‌సుందర్‌రెడ్డి



కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసిన జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: జిల్లాలోని వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాకినాడ జిల్లా నూతన సంయుక్త కలెక్టర్ (జేసీ) ఎస్. రామ్‌సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించిన నేపథ్యంలో ఆయన బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. అనంతరం కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రాధాన్యత అంశాలపై ఇద్దరూ చర్చించారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన రామ్‌సుందర్‌రెడ్డిని జిల్లా రెవెన్యూ అధికారి డి. తిప్పేనాయక్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, పౌరసరఫరాల సంస్థ, సర్వే, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు పలువురు జేసీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను జిల్లా రెవెన్యూ అధికారితో కలిసి పరిశీలించారు.

మహాశివరాత్రికి రూ.29.46 లక్షల ఆదాయం



హుండీల లెక్కింపును పరిశీలించిన దేవదాయశాఖ తనిఖీదారు ఫణేంద్రకుమార్ తదితరులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఆలయంలో స్వామి వారి కల్యాణం, మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించిన విషయం విదితమే. మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి రూ.29,46,474 ఆదాయం వచ్చిందని ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. మహాశివరాత్రికి వచ్చిన ఆదాయం తెలుసుకోవడానికి హుండీల లెక్కింపు జరిగిందని ఈఓ చెప్పారు. దేవదాయ శాఖ తనిఖీదారు ఫణేంద్రకుమార్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. మహాశివరాత్రికి హుండీల ద్వారా రూ.12,00,080, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయం, పూజా రుసుం, అన్నదానం విరాళాలుగా రూ.17,46,394 ఆదాయం వచ్చిందని ఈఓ చెప్పారు. గత ఏడాది కంటే రూ.4,19,919 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు పర్యవేక్షించారు.

అన్నవరం ఆలయ డీసీగా రమేష్‌బాబు



రమేష్‌బాబు

అన్నవరం: రమా వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా అరసవిల్లి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న డీఎల్‌వీ రమేష్‌బాబును నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అన్నవరం దేవస్థానం డీసీగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ఈఓగా బదిలీ చేశారు. రమేష్ బాబు గత నెల వినిమిదో తేదీన డీసీగా పదోన్నతి పై అరసవిల్లి ఈఓగా నియమితులయ్యారు. నెల రోజుల తరువాత మళ్లీ ఇక్కడ డీసీగా నియమితులవ్వడం విశేషం.

ఎన్నికలపై సమీక్ష

కాకినాడ సిటీ: ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కృతికా శుక్లాతో ఆయన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఆర్వో డి.తిప్పేనాయక్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో బ్యాంకింగ్ సేవలు

కలెక్టర్ కృతికా శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఫైనాన్షియల్ లెటరసీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, ఆర్బీకేలలో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా బ్యాంకింగ్ సేవలను రైతులకు మరింత అందుబాటులోకి తేవాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా బ్యాంకర్లను కోరారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో బ్యాంకర్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా స్థాయి రివ్యూ కమిటీ, కన్సల్టేటివ్ కమిటీ సమావేశాలు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. డిసెంబర్ 31వ తేదీతో ముగిసిన త్రైమాసికానికి జిల్లాలో వివిధ ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన 17,073 కోట్ల రుణాల కల్పన లక్ష్యాన్ని మించి రూ.17,739 కోట్ల మేరకు రుణాలు కల్పించి 104 శాతం ప్రగతి సాధించినందుకు బ్యాంకర్లను, అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,91,952 మంది రైతులకు రూ. 3,192 కోట్లు, రబీ సీజన్‌లో ఇప్పటి వరకూ 1,26,952 మంది రైతులకు రూ.1,980 కోట్లు పంట రుణాలు కల్పించారన్నారు. మహిళా స్వయం సహాయ బృందాలకు డీఆర్‌డీఏ ద్వారా 19,718 సంఘాలకు రూ.1,657 కోట్లు, మెప్మా ద్వారా 5,043 సంఘాలకు రూ.568 కోట్ల రుణాలు కల్పించడం ముదావహమన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం కింద 77 మంది ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.9 కోట్ల 43 లక్షలు మంజూరు చేశారని కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ పి.పూర్ణిమ, కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయి మనోహర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఎల్డీం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, డీసీసీబీ సీఈవో నరసింహారావు, మెప్మా పీడీ బి ప్రియంవద, వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయకుమార్, పరిశ్రమల కేంద్రం జీఎం టి.మురళీ, మెప్మా పీఓ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగు మార్చేశారు...!

- టీడీపీ ఫ్లెక్సీల రాజకీయం
- వర్మకు టిక్కెట్ రాదని తెలిసి స్థానికత అంటూ ప్రచారం
- టీడీపీ ఫ్లెక్సీల స్థానంలో స్థానికుడికే ఓటు అంటూ ఫ్లెక్సీలు

పిఠాపురం: పిఠాపురంలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ మళ్లీ రంగు మార్చేశారు. ఇప్పటి వరకు జనసేన అధినేత పిఠాపురంలో పోటీకి వస్తే తాను అండగా ఉండి నెగ్గించి బంగారు పళ్లెంలో పెట్టి ఇస్తానంటూ వర్మ చెప్పుకొచ్చారు. పవన్ కల్యాణ పిఠాపురం నుంచి పోటీ చేస్తారనగానే రంగు మార్చేశారు. టీడీపీ జెండాల స్థానంలో తెలుపు రంగు జెండాలపై స్థానికుడికే నా ఓటూ అంటూ స్థానికతను తెరపైకి తీసుకు వచ్చేందుకు పావులు కదుపుతున్నారు. ఒక పక్క పొత్తు ధర్మం పాటిస్తామంటూ చెబుతూనే పవన్ కల్యాణ్ స్థానికుడు కాదంటూ ప్రచారం ముమ్మరం చేశారు. 2014లో తనకు టిక్కెట్ రాకపోవడంతో టీడీపీ జెండాలను తగులబెట్టి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వర్మ ఇప్పుడు అదే రాజకీయాలను రిపీట్ చేస్తున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు. జెండా రంగులు మార్చేయడం ఆయనకు కొత్త కాదని ఇలాంటి వ్యక్తితో పొత్తు అనడం మంచిది కాదని జనసేన నేతలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్మ ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీలు పిఠాపురంలో దుమారం రేపుతున్నాయి. నిజంగా స్థానికత గురించి మాట్లాడాలంటే వర్మ కూడా స్థానికేతరుడే అంటూ జనసేన నేతలు అంటున్నారు. స్థానికుడునని చెప్పుకునే వర్మ ఒక్క రోజు కూడా ఇక్కడ లేరని కాకినాడలో సొంత ఇల్లు కట్టుకుని, చుట్టపుచూపుగా ఇక్కడకు వచ్చి పోయే వర్మ స్థానికత గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందంటున్నారు.



టీడీపీ ఫ్లెక్సీ స్థానంలో రంగు మార్చి వేసిన మరో ఫ్లెక్సీ

వాళ్ల పని విమర్శించడమే

- ఎంపీ గీత
- పిఠాపురంలో బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత

పిఠాపురం: చేతగాని వాళ్లే విమర్శలకు దిగుతారు కాని మేము మాత్రం చెప్పింది చేస్తాం. వాళ్ల పని విమర్శించడమైతే మా పని అభివృద్ధి చేయడం అంటూ టీడీపీ నేతలను ఉద్దేశించి కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వంగా గీత అన్నారు. పిఠాపురంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఇక్కడ బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారని, నిధులు లేకపోవడం వల్ల నిర్మాణానికి నోచుకోలేదని బీసీ సంఘాల ప్రతినిధులు తన వద్దకు వచ్చి తమకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారన్నారు. తను ఒక సంస్థతో మాట్లాడి సీఎస్సార్ నిధులు రూ.50 లక్షలు ఇస్తానంటే అవి సరిపోవని, రూ.కోటి ఇవ్వాలని అడగగా వారు సమ్మతించిన తరువాతే శంకుస్థాపన చేస్తున్నానన్నారు. గతంలో మాదిరి వట్టి మాటలు చెప్పి మాయ చేయడం కాకుండా నిజంగా నిధులు తెచ్చి నిర్మాణం పూర్తి చేసే వరకు తాను నిద్రపోనన్నారు. ఈ శంకుస్థాపన వారం రోజుల క్రితమే చేయాల్సి ఉండగా నిధులు విడుదలకు మాట ఇచ్చేవరకు ఆగాలని బీసీ నాయకులను తాను ఆపానన్నారు. నిధులు విడుదలకు సంపూర్ణ హామీ వచ్చాకే తాను శంకుస్థాపన చేస్తున్నానని తెలిపారు. ఈ నిర్మాణానికి పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చెందిన భూమిని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి అప్పగించిందని ఆమె తెలిపారు. బీసీ నేత కొత్తపల్లి బుజ్జి మాట్లాడుతూ బీసీలతో ఆటలాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ నేత వర్మను హెచ్చరించారు. బీసీలకు ఇన్నాళ్లకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తుంటే సంతోషించడం మానేసి ఎదురుదాడికి దిగడం, దానిని ఆపాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని, బీసీల తడాఖా ఏంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొత్తపల్లి పద్మ, గండేపల్లి బాబీ, పలువురు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ భవనం ప్రారంభం



భవంతిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, చంద్రకళాదీప్తి, శివ ప్రసన్న, వెంకటలక్ష్మి, ప్రవీణ, ఆదిలక్ష్మి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో దిశ వన్‌స్టాప్ సెంటర్ నూతన భవంతి ప్రారంభమైంది. బుధవారం ఈ భవనాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. జీజీహెచ్‌లోని నూతనంగా నిర్మితమవుతున్న ఎంసీహెచ్ బ్లాక్‌ను ఆనుకొని ఈ భవంతి ముస్తాబయింది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.ప్రవీణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ టౌన్ ప్రెసిడెంట్ సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, దిశ చట్టం ద్వారా మహిళలకు భద్రత కల్పించడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం అన్నారు. ఈ చర్య మహిళల భద్రత పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. పీడీ ప్రవీణ మాట్లాడుతూ నూతన భవంతి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.అర కోటి వెచ్చించిందని తెలిపారు. కౌన్సెలింగ్, మెడికల్ ఎగ్జామినేషన్‌కి, వీడియో కాన్ఫరెన్సు, బాధితుల వసతి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, స్టాఫ్ రూం, కిచెన్ ఇలా మొత్తం ఏడు గదులతో భవంతి రూపుదిద్దుకుందని వెల్లడించారు. డీపీసీవో వెంకట్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ శైలజల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు పాల్గొన్నారు.


క్లుప్తంగా

జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ

ముమ్మిడివరం: జపాన్‌లో ఉద్యోగం చేయాలనుకునే నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ ఎన్‌ఆర్ ఆధ్వర్యంలో దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ఇందుకు నర్సింగ్ చదివిన 32 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారికి జపనీస్ భాష, ఎన్ 5,ఎన్ 4, ఎన్ 3, స్థాయిలలో నావిస్ ఎన్‌ఆర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ఫీజు రూ.3 లక్షలు, రిజిస్ట్రేషన్‌కు రూ.50 వేలు అవుతుందని తెలిపారు. ఇందులో రూ.25 వేలు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మిగిలిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాలన్నారు. శిక్షణ ఫీజు మూడు విడతలుగా కట్టవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే జపాన్‌లో రూ.1.10 లక్షల నుంచి రూ.1.40 లక్షల వేతనంతో ఉద్యోగం లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 95814 22339 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



అప్రమత్తతే ఆరోగ్య మంత్రం



- నేడు ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం
- అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ రోగుల వార్డు

అమలాపురం టౌన్: మనం ఏది తిన్నా, తాగినా, మన శరీరంలోకి ఏదైనా పంపించినా (ఇంజెక్ట్ చేసినా) అది రక్తం ద్వారా మూత్ర పిండాల్లోకి (కిడ్నీలు) పంపిణీ అవుతుంది. అందుకే మానవ శరీరంలో మూత్ర పిండాలు పని తీరు అత్యంత కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మూత్ర పిండాలను చాలా జాగ్రత్తగా రక్షించుకోవాలి. గురువారం (మార్చి 14) ప్రపంచ కిడ్నీల దినోత్సవం. ఈ సందర్భంగా డయాలసిస్ యూనిట్లపై ప్రత్యేక కథనం.

అమలాపురం ఏరియా ఆస్పత్రిలో..

కిడ్నీ వ్యాధి బాధితులకు తప్పకుండా డయాలసిస్ (రక్తమార్పిడి - శుద్ధీకరణ) చేయాలి. ఈ డయాలసిస్ యూనిట్లు (డయాలసిస్ మెషీన్లు) ఒక్క అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోనే 17 ఉన్నాయి. నేషనల్ హెల్త్ మిషన్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ అపోలో డయాలసిస్ విభాగం పర్యవేక్షణలో ఈ విభాగం నడుస్తోంది. ఈ 17 యూనిట్ల ద్వారా రోజుకు దాదాపు 50 మంది కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు.

ఒక్క రోగికి 4 గంటల సమయం

ఒక్కో రోగికి ఈ మెషీన్ల ద్వారా డయాలసిస్ చేసేందుకు సుమారు 4 గంటల సమయం పడుతుంది. రోగి వారంలో కనీసం రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా పేద కుటుంబాలకు చెందిన రోగులు వైద్యాన్ని అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా పొందుతున్నారు. ప్రభుత్వ పరంగా ఈ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్లు ఉంటే, ప్రైవేటుగా అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. రోగి ఆధార్ కార్డు వెంట తీసుకుని వస్తే చాలు పూర్తిగా ఉచితంగా వైద్యం చేస్తున్నారు. అమలాపురం డయాలసిస్ యూనిట్లలో వైద్యాధికారి డాక్టర్ సోహిల్, యూనిట్ మేనేజర్ వి.దుర్గాప్రసాద్ వైద్యసేవలు అందిస్తున్నారు.

అధిక మందుల వాడకంతో అనర్థాలు

మనిషికి తరచూ వచ్చే వివిధ వ్యాధుల నివారణ కోసం అధికంగా ఔషధాలు (మందులు) వాడకం దుష్పరిణామాలకు దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. అవి కిడ్నీ రోగాల వైపు నెట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఏదైనా అనారోగ్యం కలిగితే నిపుణులైన వైద్యుల సిఫారసుతోనే మందులు మందుల వాడాలి. సొంత వైద్యం లేదా ఎవరో ఏదో చెప్పారని సొంత నిర్ణయాలతో మందులు వాడకూడదు. మోతాదుకు మించి మందులు వాడడం కూడా చేటు చేస్తుంది.

ఈ మందులతో కిడ్నీలపై తీవ్ర ప్రభావం!

ఆస్ప్రిన్, నప్రోక్సెన్, ఇబుప్రొఫెన్ వంటి మందులు అధికంగా వాడితే కిడ్నీలపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కిడ్నీ రోగులకు ఉచితంగా వైద్యం



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్‌ను త్వరలోనే మరిన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నాం. ఇటీవల నాడు - నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన పైఅంతస్తులో డయాలసిస్ యూనిట్‌కు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం. ప్రస్తుతం ఉన్న డయాలిసిస్ యూనిట్ ద్వారా రోగులకు పూర్తి స్థాయి వైద్యం అందిస్తున్నాం. ఒకేసారి 17 మంది రోగులకు డయాలిసిస్ చేసే సామర్థ్యం ఇక్కడ ఉంది. కిడ్నీ రోగులకు పైసా ఖర్చు లేకుండా ఉచిత వైద్యం అందుతోంది.

– డాక్టర్ కె.శంకరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

ఒక వేళ పైమందులు వాడాల్సిన పరిస్థితి అనివార్యమైతే కిడ్నీ రోగులు సంబంధిత వైద్యుడిని సంప్రదించి, అతడి సూచనలు, సలహాలకు లోబడి మాత్రమే వాడాలి. ఏదైనా వ్యాధికి క్రమం తప్పకుండా దీర్ఘకాలంగా వాడాల్సి వస్తే కిడ్నీ సమస్యలు ఉంటే ఆ విషయాన్ని వైద్యుడి దృష్టిలో కచ్చితంగా ఉంచాలి. కిడ్నీ వ్యాధులు వస్తే అవి సంబంధిత వైద్య నిపుణుడి పర్యవేక్షణలో వాడే మందులతో తగ్గించుకునే స్థాయిలోనే జాగ్రత్తలు పడాలి. డయాలసిస్ వరకూ వచ్చిందంటే వ్యాధి తీవ్రతరం అయినట్లే. డయాలసిస్ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఖర్చుల కోసం ప్రతినెలా రూ.10 వేలను పింఛన్‌గా అందజేస్తోంది.

లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపితే చర్యలు



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ నుంచి లైసెన్స్ పొందకుండా డ్రగ్స్ అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన బృందం బుధవారం డ్రగ్స్ విక్రయ సంస్థల పార్శిల్ కార్యాలయాలు, గోడౌన్లను తనిఖీ చేసింది. రాజమహేంద్రవరం గాదాలమ్మ నగర్‌లోని ట్రాన్స్‌కో కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీసీఎల్ లిమిటెడ్ పార్శిల్ కార్యాలయాలు, గోడౌన్లను పరిశీలించింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాటికి నోటీసులు జారీ చేశామన్నారు. కొన్ని శాంపిల్ మందులు లభించాయని, వాటిని సీజ్ చేసి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 ప్రకారం సదరు సంస్థకు నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, వెంకట నాగరాజు, భార్గవ మహేష్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు ప్రాజెక్టులు



విద్యార్థి ప్రవీణ్‌కు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందిస్తున్న ప్రముఖులు

అమలాపురం టౌన్: జాతీయ స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి గిరజాల వీఎస్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కా సత్య ప్రవీణ్ రూపొందించిన 'ప్లాంట్ గ్రోయింగ్ మెషీన్' అనే ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో సత్య ప్రవీణ్‌కు ప్రాజెక్టుకు అభినందనలు లభించాయన్నారు. విద్యార్థితో పాటు గైడ్ చేసిన ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మధుసూదనరావు, ఉప విద్యాశాఖాధికారి ఎస్.నరసింహఫణి, ఉమ్మడి జిల్లా పరీక్షల అధికారి హనుమంతరావు, జిల్లా విద్యాశాఖ ఏడీలు సురేష్, విజయలక్ష్మి అభినందించారన్నారు. అలాగే అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కామేశ్వరరావులు విజేత విద్యార్థి, గైడ్ టీచర్‌ను అభినందించారు.

కాకినాడ జిల్లా నుంచి మరొకటి..

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు జిల్లా నుంచి ఒకే ఒక ప్రాజెక్టు ఎంపికైంది. కాకినాడ అర్బన్ గొడారిగుంట మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి గుత్తుల అనుష్క రూపొందించిన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ ప్రాజెక్టు ఈ ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 11 నుంచి 13 వరకూ చిత్తూరులో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించగా 240 ప్రాజెక్టులు అన్ని జిల్లాల నుంచి పాల్గొనగా ఇందులో 24 ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని అనుష్క, గైడ్ చంద్రా రెడ్డిని పాఠశాల ఆర్‌జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీవైఈఓ డానియల్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ అభినందించారు.



జాతీయ స్థాయికి ఎంపికైన సీడర్‌ఫర్ స్మాల్ ఫార్మర్స్ ప్రాజెక్టు

వినాయక చిట్‌ఫండ్ కంపెనీలో తనిఖీలు

- రికార్డుల స్వాధీనం
- బాధితుల ఫిర్యాదుతో అధికారుల చర్యలు



వినాయక చిట్స్ కంపెనీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ లీగల్: కాకినాడలోని శ్రీ వినాయక ఈస్ట్ చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ (చిట్ కంపెనీ)లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రికార్డులను పరిశీలించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో శ్రీ వినాయక ఈస్ట్ చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను మేనేజింగ్ డైరెక్టర్ పి.సేతు మాధవరావు, ఫోర్‌మెన్ పి.శివశంకర్, ఇతర సిబ్బందితో కలిసి నిర్వహిస్తున్నారు. ఉద్యోగస్తులు, వ్యాపారులు, కార్మికులు వీరి దగ్గర చిట్స్ కడుతున్నారు. చీటీ పాడుకున్న వారికి గతంలో సవ్యంగా సొమ్ములు అప్పగించేవారు. దీంతో నమ్మకం కలిగిన చాలామంది లక్షల రూపాయల చిట్స్ వేశారు. దీనితో ఈ సంస్థ వ్యాపారం బాగా పెరిగింది. అయితే రెండేళ్లుగా రూ.10 లక్షలు, రూ.5 లక్షల చీటీలు పాడుకున్న పాటదారులకు సొమ్ములు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నిర్వాహకుల తీరుతో విసిగిపోయిన ఖాతాదారులు ఇటీవల జిల్లాస్థాయి స్పందనలో కలెక్టర్‌కు, కాకినాడ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదును స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర ఐజీకి జిల్లా రిజిస్ట్రార్ స్టేట్‌మెంట్స్ పంపించారు. ఈ విషయమై చిట్‌ఫండ్ నిర్వాహకులను అధికారులు ప్రశ్నించినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఎం.సుధారాణి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ కలిసి బుధవారం వినాయక చిట్‌ఫండ్ కంపెనీని తనిఖీ చేశారు. రామలక్ష్మి పట్నాయక్ మాట్లాడుతూ పాటదారులకు డబ్బులు తిరిగి చెల్లించాలని కొంతకాలంగా చిట్స్ నిర్వాహకులకు చెబుతున్నా వారిలో మార్పు రాలేదన్నారు. కానీ చిట్స్ కడుతున్న వారి నుంచి యథావిధిగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు రికార్డుల పరిశీలనలో గుర్తించామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు అండగా ఉంటారని, ఏ విధమైన ఫిర్యాదులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కిక్ బాక్సింగ్‌లో దినేష్ ప్రతిభ



దినేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సాయిబాబు

రాజోలు: అంతర్ యూనివర్సిటీ పరిధిలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి (బీఏ మొదటి సంవత్సరం) సీహెచ్ దినేష్ కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు దినేష్‌ను అభినందించారు. పీడీ బొంతు మధుకుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో దినేష్ 81 కేజీల విభాగంలో ప్రతిభ చూపాడన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరులో కోళ్లఫారం కాలనీ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరంలో ప్రవేశాలకు బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.అమృతవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియెట్ బైపీసీ మొదట సంవత్సరంలో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల బాలికలు ఏప్రిల్ 11 వరకు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్‌ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాప్‌అవుట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు ప్రవేశాలకు అర్హులన్నారు. ఎంపికైన బాలికలకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలను 84990 80847, 98664 13575 నంబర్లకు ఫోన్ చేసి, నేరుగా విద్యాలయంలోనూ తెలుసుకోవచ్చన్నారు.

పరుగుల వీరుడు నాగబాబుకు అభినందనలు



నాగబాబును అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: కాకినాడ జిల్లాలో మలేరియా సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్న సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు మరో మైలురాయిని దాటారు. అథ్లెటిక్ పోటీల్లో ఇప్పటి వరకూ 60 పతకాలు సాధించిన ఆయన ఈ నెల 9 నుంచి 10వ తేదీ వరకూ కర్ణాటకలో జరిగిన సౌత్ ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ 2024 సాధించాడు. 55 ఏళ్ల వయసులోనూ పరుగు పందెంలో ప్రతిభ చూపుతున్న నాగబాబును సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బుధవారం సాయంత్రం అభినందించారు. నాగబాబు కర్ణాటకలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, 800 మీటర్ల పందెంలో కాంస్య పతకం, 200 మీటర్లలోనాలుగో స్థానం, 400 మీటర్ల రిలేలో కాంస్య పతకం సాధించారు. ఆయన 2013 నుంచి 2024 వరకు జరిగిన వివిధ జాతీయ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ పరుగు పందెం 100, 200, 400, 800, 1500 మీటర్లలో, రిలే వివిధ విభాగాల్లో ఇప్పటి వరకు 15 బంగారు, 19 వెండి, 26 కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

సరిహద్దుల్లో విస్తృతంగా సోదాలు



కాకినాడ-యానాం రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. పుదుచ్చేరి రాష్ట్రం నుంచి కాకినాడ జిల్లాకు అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం కాకినాడ-యానాం ప్రధాన రహదారిలో ఉప్పలంక వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్, ఎస్ఈబీ, ఏఆర్, దిశ, సైబర్, స్పెషల్ బ్రాంచ్, హోం గార్డ్ తదితర విభాగాలను ఉన్నతాధికారులు ఏకతాటిపైకి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తి చేశారు. కొన్ని గ్రామాల్లో నాటుసారా తయారు చేసే వ్యక్తులపై, పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పలువురిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

సర్పవరం జంక్షన్‌లో..

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు, సర్పవరం పోలీసులు కాకినాడకు రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేసి రాకపోకలపై ఆరా తీశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సర్పవరం జంక్షన్ విశాఖ డైయిరీ వద్ద వాహనాలు తనిఖీ చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

పాపం పసివాడు



బోట్‌క్లబ్ పార్కులో లభ్యమైన బాలుడు

కాకినాడ రూరల్: పాపం పసివాడు. తల్లి పొత్తిళ్ల నుంచి తుప్పలకు చేరాడు. అతడి అరుపులు విన్న స్థానికులు స్పందించి రక్షించారు. కాకినాడ సర్పవరం జంక్షన్ సమీపంలో బోట్‌క్లబ్ వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. బోట్‌క్లబ్ వద్ద నేలపై పచ్చిక, తుప్పలు మధ్య నుంచి చిన్నారి ఏడుపు వినిపించింది. స్థానికులు పరుగున అక్కడకు వెళ్లి చూడగా, తెల్లటి గుడ్డలో చుట్టి ఉన్న బాలుడు కనిపించాడు. వెంటనే 108కు కాల్ చేయడంతో సిబ్బంది వచ్చి జీజీహెచ్‌కు తరలించారు. బాలుడు క్షేమంగా ఉండడంతో బోట్‌క్లబ్‌లో వాకింగ్ కోసం వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడి పుట్టి రెండు, మూడు రోజులై ఉండవచ్చని భావిస్తున్నారు. ఎవరో విడిచి వెళ్లిపోయి ఉంటారని, సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తామని సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

ప్రమాదవశాత్తూ అన్న.. గుండెపోటుతో తమ్ముడు

- పది రోజుల వ్యవధిలో అన్నదమ్ముల మృతి
- రాయవరంలో విషాదం



చంద్రమళ్ల విజయ్ (ఫైల్)



చంద్రమళ్ల ప్రవీణ్ (ఫైల్)

రాయవరం: పెయింటింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి అన్న మృతి చెందాడు. దాన్ని తట్టుకోలేక తమ్ముడు పది రోజుల అనంతరం గుండెపోటుతో కన్నుమూశాడు. రాయవరంలో జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాయవరం గ్రామానికి చెందిన చంద్రమళ్ల శ్రీను, అనిత దంపతులు కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి విజయ్ (28), ప్రవీణ్ (24) అనే కుమారులు ఉన్నారు. 8వ తరగతి చదువుకున్న విజయ్, 7వ తరగతి వరకు చదివిన ప్రవీణ్ కూలి పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన విజయ్ పెయింటింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. విజయ్‌కు భార్య వెన్నెల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అన్న మృతి తమ్ముడు ప్రవీణ్‌ను కలచివేసింది. పది రోజులుగా రోదిస్తున్న ప్రవీణ్ మంగళవారం రాత్రి గుండెపోటుతో ఇంటి వద్ద కుప్పకూలి పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చేతికందివచ్చిన ఇద్దరు కుమారుల మృతితో శ్రీను, అనిత భోరున విలపిస్తున్నారు. ఇక మేము ఎవరి కోసం బ్రతకాలంటూ కన్నీరుమున్నీరయ్యారు.

ప్రవీణ్ నేత్రాల దానం

గుండెపోటుతో మరణించిన ప్రవీణ్ కళ్లను దానం చేసేందుకు తల్లిదండ్రులు శ్రీను, అనిత అంగీకరించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్ కార్నియాను భద్రపర్చి తీసుకుని వెళ్లారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి తదితరులు ప్రవీణ్ మృతదేహానికి నివాళులర్పించారు.

వశిష్ట నదిపై వంతెన పనులకు భూమిపూజ

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం రూ.49.5 కోట్లతో వశిష్ట నదీపాయపై వంతెన నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడం అభినందనీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ప్రధాన పంట కాలువపై ఇటీవల ప్రారంభించిన వంతెన నిర్మాణం పూర్తికాగా, నదిపై వంతెన పనులకు ఎమ్మెల్యే చిట్టిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వేణుగోపాలరావు, అనురాధ, చిట్టిబాబు మాట్లాడారు. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం జగన్‌కు లంక గ్రామాల ప్రజలు వంతెన విషయం తెలిపారన్నారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే పంట కాలువపై వంతెన నిర్మాణం పూర్తయ్యిందని, ఇప్పుడు నదిపై కూడా వంతెనను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అనంతరం నదిపై బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, సర్పంచ్ దంగేటి అన్నవరం, నాయకులు సాధనాల రమేష్, కత్తుల విక్టర్ బాబు, కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల రాజు, పినిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎంపీ అనురాధ